'కుంకీ'కి సంగతి

50 ఎకరాల్లో 'ఆహార' పంటలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: జనావాసాల్లోకి వచ్చి పంటలను ధ్వంసం చేయడమే కాకుండా, మనుష్యుల ప్రాణాలను గాల్లో కలిపేస్తున్న ఏనుగులను అటవీ ప్రాంతాల్లోకి తరిమేందుకు బెంగుళూరు నుంచి వచ్చిన 'కుంకీ' ఏనుగులకు 'మెనూ' సిద్ధమవుతోంది. పలమనేరు అటవీ ప్రాంతంలో 50 ఎకరాల్లో ఏనుగులు తినేందుకు వీలైన పంటలను సాగు చేస్తున్నట్లు అటవీ అధికారి వేణుగోపాల్ మీడియాకు తెలిపారు. రంజన్, కృష్ణా, దేవ, అభిమన్యు కుంకీ ఏనుగులను కర్నాటక నుంచి తీసుకొచ్చారు. ఏపీకి చెందిన వినాయక్, జయంతులను చిత్తూరు జిల్లా పలమనేరు మండలం ముసలిమడుగు ఏనుగుల శిబిరంలో ఉంచారు. ఈ కుంకీల వ్యవహారం, దినచర్య ఎలా ఉందనేది పరిశీలిస్తే ఒక్కో కుంకీ ఏనుగు ఉదయం 6 గంటలకు 350 గ్రాముల బెల్లం, ఏడు గంటలకు వరి కంకులు, 8.30 గంటలకు శిక్షణ ఉంటుంది. శిక్షకుడు చెప్పిన విషయాలు అవగాహన చేసుకుంటేనే పచ్చగడ్డి, రావి, జువ్వి, అత్తి, మర్రి, అరటిబోదలను ఆహారంగా 50 కిలోలు తింటాయి. ఉదయం 9 గంటలకు నీరు తాగిన తరువాత 10 గంటలకు రాగి ముద్ద పెడతారు. అప్పటి నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ అడవిలో నడకతో పాటు, మేత కూడా ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు స్నానం చేయించి 5.30 గంటలకు రాగిముద్దలు అందించి, నీరు తాగిస్తారు. 6.30 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ వరికంకులు, రాగి ఆకులు, అరటిబోదలు, గడ్డి తింటూ నిద్రపోతాయి. ఇలా ఒక్కో ఏనుగు 17-18 గంటలు తింటూనే ఉంటాయన్నమాట. ప్రతి కుంకీ ఆహారానికి రోజుకు 3వేల రూపాయలు ఖర్చు అవుతుంది. ఈ ఏనుగుల పర్యవేక్షణకు 30 మంది సిబ్బందిని కేటాయించారు.

పులిచెర్లలో ఆగని గజదాడులు

గ్రామాల సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు, వరి పంటను తొక్కి నాశనం చేసిన ఏనుగుల గుంపు

ప్రజాశక్తి - రొంపిచెర్ల : పులిచెర్ల మండలంలో వరుస ఏనుగుల దాడులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గురువారం వేకువజామున ఏనుగుల గుంపు పులిచెర్ల మండలంలోని పలు ప్రాంతాలలో విధ్వంసం సృష్టించాయి. పులిచెర్ల మండలం తూర్పు అటవీ ప్రాంతాలలో 15 ఏనుగుల గుంపు తిష్ట వేసి అర్ధరాత్రి తర్వాత పంట పొలాలపై విరుచుకుపడుతున్నాయి. అటవీ ప్రాంతాల సమీపంలో ఉన్న రైతులకు చెందిన పంటల పైన తీవ్ర ప్రతాపం చూపిస్తున్నాయి. దేవళంపేట, పాల్యం, కమ్మపల్లి, దేశిరెడ్డిగారిపల్లి, రెడ్డివారిపల్లి కు చెందిన రైతుల వరి నారుమడి, వరి పంట, అరటి చెట్లు, వేరుశనగ పంటలను తొక్కి నాశనం చేశాయి. ఈ గ్రామాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. మరోవైపు ఈ ఏనుగులు గుంపును తరిమికొట్టడానికి కుంకి ఏనుగులను రంగంలోకి దించారు. ఇది ఏ మేరకు సక్సెస్ అవుతుందో చూడాలని రైతులు, ప్రజలు అంటున్నారు.

అంగన్వాడీలపై బెదిరింపులు ఆపండి..

పండగ రోజూ వేధింపులేనా.. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని పనిచేయని ఫోన్లు తమకు అవసరం లేదు మీరే తీసుకోండి అని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా చిత్తూరు జిల్లాలో కూడా అంగన్వాడీలు ఫోన్లు తిరిగి ఇవ్వడం జరిగిందని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు తెలిపారు. ఈ ఉద్యమాన్ని నీరుగార్చడానికి అంగన్వాడీల మధ్య చిచ్చు పెట్టడానికి అధికారులు రకరకాల పద్ధతుల్లో బెదిరిస్తూ క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించే పని చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సమస్యలు పరిష్కారం చేస్తే ఎందుకు ఉద్యమం చేస్తారని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కారం చేయకుండా బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాము పనిచేస్తాము, పనిచేసే ఫోన్లు ఇవ్వండి అని పదేపదే అంగన్వాడీలు అడుగుతుంటే పట్టించుకోకుండా బెదిరింపులకు పాల్పడటం దారుణమన్నారు. చిత్తూరు జిల్లాలో కొంతమంది అధికారులు అత్యుత్సాహం చూపి అంగన్వాడీలు చేయని పనిని చేసినట్లు తప్పుడు సమాచారం ఇస్తూ పక్కపక్క ప్రాజెక్టులో గొడవలు అయ్యే విధంగా చేస్తున్నారని ఆరోపించారు. చేతనైతే సమస్యలు పరిష్కారం చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పరిష్కారం చేయండి తప్ప అంగన్వాడీలపై పెత్తనం చేయడం సరైంది కాదన్నారు. చట్ట విరుద్ధంగా బెదిరిస్తున్న మీ పైనే కేసులు పెట్టాలని, పండగ పూట కూడా మహిళలను ప్రశాంతంగా ఉండన్వీరా అన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేసే దిశగా ప్రభుత్వ అధికారులు చొరవ చూపాలని లేనిపక్షంలో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సెల్ ఫోన్లు మాకొద్దు..

ఫోన్లను బాక్సులో వేసి సీడీపీవో కార్యాలయంలో ఉంచిన అంగన్‌వాడీలు

విజయపురం (నగరి): పనిచేయని ఫోన్లు మాకొద్దు అంటూ అంగన్వాడీ కార్యకర్తలు ఫోన్లు మూటగట్టి సీడీపీవోకు అప్పగించారు. గురువారం సీడీపీవో కార్యాలయానికి సీఐటీయూ నాయకురాలు ధనకోటి ఆధ్వర్యంలో వెళ్లిన వారు తమకు సెల్‌ఫోన్లు వద్దంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన ఫోన్లు సరిగ్గా పనిచేయడం లేదని అయినా అధికారులు, ప్రభుత్వం రోజుకో యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని చిన్నపిల్లలు, గర్భవతులు, బాలింతలకు పౌష్టిక ఆహారం అందుకునే లబ్ధిదారుల వివకాలె పొందుపరచాలని వేధిస్తోందన్నారు. తమ కార్యకలాపాలను ఇక నుంచి రికార్డుల ద్వారా మాత్రమే ఇస్తామని, ఫోన్లలో ఇవ్వలేమన్నారు. చిన్న పిల్లలకు విద్యా బుద్దులు నేర్పించే అంగన్‌వాడీ సిబ్బందికి యాప్‌లతో ముప్పుతిప్పలు పెడుతూ నరకాన్ని చూపిస్తున్నారన్నారు. పలు ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య ఉండటతో సమాచారం పొందుపరడచంలో తలలు పట్టుకుంటున్నామని అన్నారు. వేతనానికి తగ్గ పనులు మాత్రమే అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్‌లు తీసకోవడానికి అధికారులు నిరాకరించడంతో వారిని ఒక బాక్స్‌లోవేసి కార్యాలయంలో పెట్టేశారు.

సోమలలో భారీ వర్షం

- కనువిందు చేసిన ఇంద్రధనస్సు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల పరిసర ప్రాంతాలలో గురువారం ఉదయం 5.15 నుండి 6.30 గంటల వరకు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. చిన్నచిన్న చినుకులతో ప్రారంభమైన వర్షం పెద్ద చినుకులు పడుతూ ఉరుములు మెరుపులు రావడంతో విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడింది. వర్షం నిలిచిన వెంటనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ తూర్పు వైపు నుండి పుట్టుకొచ్చాడు. ఇదే సందర్భంలో ఆకాశంలో ఇంద్రధనస్సు ఏర్పడడంతో పలువురు తమ సెల్ఫోన్ కెమెరాలలో బంధించడం ఇంటిలోని చిన్నారులను కూడా నిద్రలేపి ఇంద్రధనస్సు చూపించడం కనిపించింది.

చెరువులను తలపిస్తున్న రోడ్లు

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు, ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బుధవారం రాత్రి గురువారం ఉదయం కురిసిన వర్షానికి మండలం నుంచి రాగి మాను పెంట గ్రామానికి వెళ్లే దారిలో గుంతల్లో వర్షపు నీరు నిల్వ చేరి చెరువులను తలపిస్తున్నాయి. గుంత్లో వర్షపు నీరు చేయడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంగారుపాళ్యం నుండి రాగిమానుపెంట గ్రామ వరకు ఏడు కిలోమీటర్ల రహదారి మొత్తం గుంతలమయమై వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ఈ రహదారి గుండా ఐదు పంచాయతీలు దాదాపు 20 గ్రాములున్నాయి. ఈ గ్రామాల్లో గల ప్రజలు అనునిత్యం మండల కేంద్రానికి ఏదో ఒక పని మీద రావడం వలన ఈ గుంతల్లో ఇబ్బందులు పడుతూ మండల కేంద్రానికి చేరుకుంటున్నారు. ఈ దారి బాగు చేసేందుకు పలువురు ప్రజాప్రతినిధులు విన్నవించుకున్న ప్రభుత్వంలో స్పందన లేదని, ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రహదారులను గుంతలను పూడ్చి రహదారిని బాగు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపు నీరు

సోమల: మండలంలోని నెల్లిమంద పంచాయతీ బురుజు పల్లి వద్ద కందూరు సోమల ప్రధాన రహదారిపై ఉన్న సిమెంటు రోడ్డు వర్షపు నీటితో నిండిపోయి చెరువును తలపిస్తోంది. వర్షం కురిసినప్పుడు నీరు రోడ్డుపై నిలువ ఉండకుండా వెళ్లేందుకు ఎలాంటి మార్గం లేకపోవడంతో ఈ ప్రాంతం చెరువును తలపిస్తూ వాహనాల రాకపోకలకు పాదచారుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. ఆర్ అండ్ బి అధికారులు సమస్యను గుర్తించి రోడ్డుపై నిలిచి ఉన్న నీరు సజావుగా వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేసి రోడ్డుపై నీరు నిలువ ఉండకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

10న జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి విజయపురం(నగరి): ఈ నెల 10వ తేదీన తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కళాశాల మైదానం ఆవరణలో ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జూనియర్స్ సెలక్షన్స్ జరుగుతుందని చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రెటరీ పి.బాలాజి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఉదయం 8 గంటలకు మైదానానికి చేరుకోవాలన్నారు. 2006 జనవరి 2వ తేదీ తరువాత జన్మించిన వారు సెలక్షన్స్‌కు పాల్గొనడానికి అర్హులన్నారు. వారు సెలక్షన్స్‌కు ఆధార్ కార్డు, బ్లడ్ గ్రూప్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలన్నారు. వీరితో పాటు సీనియర్ ఉమెన్ పోటీలకు ఎంపిక చేసిన 15 మందికి ఫైనల్ సెలక్షన్ జరుగుతుందన్నారు. వారు కూడా సమయానికి మైదానానికి హాజరుకావాలన్నారు. చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట స్వామి, చైర్మన్ బి.జగన్నాథం నాయుడు, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు ఎంపిక ప్రక్రియలో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 70137 54776 ఫోన్ నెంబరుకు సంప్రదించాలన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధం కావాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 15న నిర్వహించబోయే జిల్లాస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మోహన్ కుమార్, డీఎఫ్ఓ ధరణి పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కార్యక్రమానికి సంబంధించి ఆయా శాఖల అధికారులు నిర్వర్తించవలసిన విధులను వారికి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు వీలుగా పోలీసు కవాతు మైదానంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. పోలీసు గౌరవ వందనం, కవాతు, బందోబస్తు, ట్రాఫిక్ సమస్యలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈకార్యక్రమంలో పాల్గొనే ప్రముఖులు, ప్రజా ప్రతినిధులకు సీటింగ్ ఏర్పాట్లు, ఆహ్వానం, అదేవిధంగా స్వాతంత్ర్య సమరయోధులను గుర్తించి వివరాలను సిద్ధం చేయాలన్నారు. ఉద్యోగుల సేవలను గుర్తిస్తూ కార్యక్రమం రోజున వారికి అందించే ప్రశంసాపత్రాల విషయంలో గందరగోళాన్ని నిరోధించేందుకు ముందుగానే వారు సిద్ధంగా ఉండేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్

సంప్రదాయ సంపదకు ప్రతీక చేనేత

చేనేత రంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది: డీఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చేనేత రంగం మన దేశ సంస్కృతికి, స్వాతంత్ర్య ఉద్యమ భావనలకు, మన కళాకారుల సృజనాత్మకతకు ఆలంబనగా నిలిచిందని డిఆర్ఓ మోహన్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని జిల్లా చేనేతశాఖ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్లోనే జరిగిన సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ మన దేశంలో ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించే అసంఘటిత రంగాలలో చేనేత ఒకటి అని, ఈ రంగానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. చిత్తూరు జిల్లాలో సుమారు 600 హ్యాండ్లూమ్ వీవర్స్ కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా వీవింగ్ వృత్తి మీద ఆధారపడుతున్నాయని, వీవింగ్ ప్రాముఖ్యంగా పెనుమూరు, సదుం, సోమల, నగరి, కర్వేటినగరం మండలాలలో చేనేత కార్మికుల ఉన్నారని, పెనుమూరు వీవర్స్ లుంగీలు ఉత్పత్తి చేస్తున్నారని, నగరి వీవర్స్ కార్టన్ బై సిల్క్ సారీలు జిల్లాలో (10) హ్యాండ్లూమ్ వీవర్స్ సహకార సంఘాలు ఉన్నాయని తెలిపారు. జాతీయ హ్యాండ్లూమ్ అభివృద్ధి పథకం కింద చిన్న క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం చేపట్టడం జరిగిందని, పెనుమూరు క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు.

విజయపురం (నగరి): సంప్రదాయ సంపదకు ప్రతీక చేనేత రంగం అని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని సాంస్కృతిక క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీకళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1905లో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమానికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. చేనేత రంగం భారతదేశ సంప్రదాయ సంపదకు ప్రతీకగా ఉందన్నారు. యువతలో స్వదేశీ వస్త్రాల పట్ల అవగాహన పెంచాలి అని పిలుపునిచ్చారు. సాంస్కృతిక క్లబ్ సమన్వయకర్త డాక్టర్ అరుణ కుమారి, ఎన్సీసీ కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వరి, అధ్యాపకులు రామానుజులు, స్వాతి, శ్రీలక్ష్మి, సుహాసిని, పంకజ, రేవతి, చినపాపమ్మ, రమేష్, ఉమామహేశ్వరి, మునికుమారి, లాల్ బాషా పాల్గొన్నారు.

చేనేత దినోత్సవ ర్యాలీలో డీఆర్ఓ మోహన్ కుమార్

మామిడి రైతుల సమస్యలపై 13న నల్లబ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా కిలో రూ.12లు చొప్పున సత్వరం రైతుల అకౌంట్లో జమచేయాలని జిల్లా వ్యాప్తంగా సంతకాల సేకరణ ఉద్యమం చేపడుతున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరిబాబు చౌదరి, సహాయ కార్యదర్శి హరిబాబు, చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం చిత్తూరులో మామిడి రైతుల రెండో దశ పోరాట కార్యక్రమంలో భాగంగా రూపొందించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుజ్జు పరిశ్రమల యాజమాన్యం నుంచి, ర్యాంపుల నిర్వాహకుల నుంచి రైతులకు రూ.12లు గిట్టుబాటు ధర చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి వారి పట్ల అంత దయ ఉంటే ప్రభుత్వమే మామిడి రైతులకూ రూ.12లు చెల్లించాలని డిమాండ్ చేశారు. మామిడి రైతుల రెండో దశ ఉద్యమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 50వేల మంది రైతులతో సంతకాలు సేకరించి ముఖ్యమంత్రికి ఈ నెలలో సమర్పిస్తామని తెలిపారు. అందులో భాగంగా ఈనెల 13న చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జిలతో నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో మామిడి రైతులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. నేతలు సుకుమార్, సుధా, రమణ పాల్గొన్నారు.

మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు

క్షేత్రస్థాయిలో పరిశీలించిన మేయర్, కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మేయర్ ఎస్.అముద అధికారులను ఆదేశించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మార్గనిర్దేశంలో గురువారం మేయర్, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, నగరపాలక అధికారులు నగరంలోని ఎమ్మెస్సార్ సర్కిల్, పలమనేరు రోడ్డు, పాత బస్టాండ్ ప్రాంతాల్లో మేజర్ డ్రైన్లను పరిశీలించారు. ప్రధానంగా వర్షాలు కురిసినప్పుడు ఎగువ ప్రాంతాల నుంచి ఎమ్మెస్సార్ సర్కిల్ వద్దనున్న కల్వర్టరుకు ఎక్కువగా నీరు రావడంతో నీరు రోడ్డు పైకి వస్తుందని ఇక్కడికి నీటి ప్రవాహం తగ్గించేందుకు ప్రత్యామ్నాయ చర్యలపై చర్చించారు. ఇందుకోసం దర్గా సర్కిల్ నుంచి వచ్చే నీటిని ఎమ్మెస్సార్ వైపు రాకుండా మళ్లించేందుకు వీలుగా మరొక కల్వర్టరు నిర్మించాలని, ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెస్సార్ సర్కిల్ వద్ద కల్వర్టరును మరింత పెద్దదిగా చేయడంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నీరునిల్వ చేరకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడానికి వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ పి.లోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఏఈ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ విస్తృత తనిఖీలు

వర్షాల నేపథ్యంలో నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ నగరంలో విస్తృతంగా పర్యటించి పలు కాలనీలు, మేజర్ కాలువలను పరిశీలించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాల్లో నీరు నిల్వ చేరడం, మేజర్ డ్రైన్లను, ఇతర మురుగునీటి కాలువల్లో పరిస్థితిపై తనిఖీలు నిర్వహించారు. గురువారం వేకువజామున కురిసిన వర్షానికి నగరంలో పలు ప్రాంతాల్లో నీరు నిలిచింది. రామ్‌నగర్ కాలనీ "ఏ క్లాస్"లో వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. వర్షపు నీటిలోనే వెళ్లి స్థానికులతో మాట్లాడారు. వర్షపు నీరు నిలవకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులతో చర్చించారు. వర్షపు నీరు సులభంగా వెళ్లేలా రెండు కల్వర్టర్లు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డీఈ రమణను ఆదేశించారు.

డ్రైనేజీ కాలువలను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

వరి సాగుకు సిద్ధమవుతున్న రైతులు

వరి నాట్లు వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -సోమల: మండలంలోని పలువురు రైతులు వరి సాగు చేసేందుకు పంట పొలాలను దుక్కులు దున్ని వరి నాటేందుకు అణువుగా మడికయ్యలను సిద్ధం చేసి ఖరీఫ్ సీజన్ వరి నాట్లు నాటుతున్నారు. గతంలో ఎద్దులతో మడకలు కట్టి దుక్కిలి దున్నేవారు. ప్రస్తుతం యాంత్రీకరణ పెరిగిపోవడంతో ట్రాక్టర్లకు మడకలు అమర్చి దుక్కి దున్ని ఆపై ఆకులు వేసి మడి కయ్య మొత్తం నీటితో నింపి బాగా నీరు ఇంక కుండా నిలచిన తరువాత వరి నారు నాటడం మొదలు పెడుతున్నారు. ఇటీవల కాలంలో రైతులు టమాటా, మామిడి పంటల ద్వారా పూర్తిగా నష్టాన్ని చవిచూడడంతో చాలామంది వరి సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. వర్షాలు కూడా అప్పుడప్పుడు పడుతూ ఉండడం మంచి వర్షాలు పడి చెరువులు నిండితే బోరు బావుల్లో భూగర్భ జలాలు పెరిగి పంటలు సాగు చేసేందుకు అవకాశం ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ క్రమంలో రైతులు అటు కూరగాయలు కూడా పండిస్తూ వరి పైరు కూడా సాగుచేస్తూ ఉన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలు అత్యంత ప్రమాదకరమైనదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని నాగయ్య కళాక్షేత్రంలో జిల్లా బాలల పరిరక్షణ సమితి, మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రపంచ తల్లిపాల పోషణ వారోత్సవాలు, పిసి అండ్ పిఎన్‌డిటి చట్టం, ఇతర మహిళా, శిశు సంబంధిత చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు, ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి, బాలల సంరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాలు, కౌమార దశ గర్భధారణలు, బాల్య లైంగిక వేధింపులు, బాల్య అక్రమ రవాణా, మత్తుపదార్థాల దుర్వినియోగం, బాలకార్మికుల ప్రభావిత ప్రాంతాలను గుర్తించేందుకు సర్వేలు నిర్వహించాలన్నారు. అందుకు, మెడికల్ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, మహిళా పోలీసులు టీంగా ఏర్పడి పైకార్యక్రమాలను అరికట్టాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో పోషక ఆహార లోపంతో సరైన బరువు లేకుండా ఉన్న పిల్లలను గుర్తించి వారికి మంచి పౌష్టికాహారం అందజేయాలని ఆదేశించారు. మాతృగర్భంలో బిడ్డ ఎదుగుతున్న దశలోనే పోషక ఆహారంపై దృష్టి పెట్టాలని, అందుకు ఐసిడిఎస్ అధికారులు గర్భిణీలకు సూచనలు సలహాలు అందజేయాలని ఆదేశించారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు

దుకాణాల్లో మున్సిపల్ అధికారులు తనిఖీలు

దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- పుంగనూరు: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడకం చేస్తున్నారని పలు ఫిర్యాదులు అందడంతో పట్టణంలో పలు దుకాణాల్లో మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆదేశాలతో సానిటరీ ఇన్స్పెక్టర్ ముని వెంకటప్ప ఆధ్వర్యంలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో చిల్లర దుకాణాలు, స్వీట్ స్టాల్లు, కూల్ డ్రింక్ షాప్, టెక్స్ టైల్స్ దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడటం వలన వివిధ వ్యాధుల బాలుర పడే అవకాశం ఉందని నిషేధిత ప్లాస్టిక్ ఎవరు వాడకూడదని అలా వాడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనలు మేర అత్యధికంగా ఉన్న మైక్రాన్ కవర్లు మాత్రమే వాడాలని తక్కువ మైక్రాన్ కవర్లు వాడిన యెడల చర్యలు తప్పమన్నారు. ఇప్పటికే పట్టణంలో పలు రకాలుగా ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. నారా, గుడ్డ బ్యాగులు మాత్రమే వాడాలని ప్లాస్టిక్ను నిషేధించి పట్టణ అభివృద్ధికి వ్యాపారుల సహకరించాలని కోరారు. ప్రధానంగా ప్లాస్టిక్ కవర్లు విక్రయించే దుకాణాలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సచివాలయం సిబ్బంది పాల్గొని తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వాడుతున్న దుకాణాలకు అపరాధ రుసుము వేసినట్లు తెలిపారు.

11న సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : మండలంలోని 21 పంచాయతీల్లో ఈ ఆర్థిక సంవత్సరం జరిగిన ఉపాధి హామీ పనులపై గత నెల 28వ తేదీ నుంచి ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహించే 18వ విడత సామాజిక తనిఖీకి సంబంధిత సామాజిక తనిఖీ ప్రజావేదిక ఈ నెల 11వ తేదీన మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో జరుగుతుందని ఎంపీడీవో కృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, పారిశుద్ధ్యం, గృహనిర్మాణ, ఇతర శాఖలల్లో చేపట్టిన పనులకు సంబంధిత అంశాలపై తనిఖీలో కనుగొన్న అంశాలను గ్రామసభలో వెల్లడించడం జరుగుతుందన్నారు.

గడ్డురులో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గడ్డురు గ్రామంలోని క్వారీని తిరుపతి పొల్యూషన్ ఏఈ మదనమోహన్, ఇరిగేషన్ కుమారస్వామి, సిఐ మురళి మోహన్, ఎస్సై పరశు రాముడు, ఆర్‌డిఓ భవాని పరిశీలించారు. గ్రామంలో క్వారీ కారణంగా తమ ఇళ్లు, పంటలు దెబ్బతింటున్నాయని ప్రజలు పిజిఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ పరిశీలించి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో వారు గురువారం గ్రామంలో పర్యటించి క్వారీ వలన దెబ్బతిన్న పంటలను, ఇళ్లను, క్వారీని పరిశీలించారు. అలాగే గడ్డూరు పాఠశాలలోని విద్యార్థులను క్వారీ పేలుళ్ల వలన వస్తున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పేలుడు సమయంలో భయంకరమైన శబ్దాలు, దుమ్ము వస్తోందని ఇబ్బందిగా ఉంటోందని తెలిపారు. నివేదికలో క్వారీ వలన దెబ్బతిన్న బాధితుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఆర్డీవో భవాని మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందజేశామని గ్రామస్తుల సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయులు కీలకం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయులు కీలకమని సర్పంచ్ కుమారి అన్నారు. గురువారం మండలంలోని ముంగరమడుగు ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ రంగంలో అయినా రాణించాలంటే ఉపాధ్యాయులు నేర్పిన విద్యాబుద్ధులతోనే సాధ్యమవుతుందని ప్రాథమిక పాఠశాలలో నేర్చుకున్న విద్య ఎంతో గొప్ప విద్య అన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన అనిత దేవిని దుశ్శాలువులతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునిరత్నం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాగేశ్వర రాజుకు సత్కారం

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ స్టేట్ డైరెక్టర్‌గా నియమితులైన ఎన్.నాగేశ్వర రాజుకు గురువారం టిడిపి నాయకులు అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు. మండల పార్టీ అధ్యక్షులు ఎం.చంగల్రాయ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎం.రాజేంద్రరెడ్డి, వి.రాజా, రవిరాజు, హేమంత్ రెడ్డి, ఎంఎం.విలాసం, చిరంజీవి ఉన్నారు.

తాగునీటి శుద్ధి యంత్రం వితరణ

ప్రజాశక్తి- విజయపురం (నగరి): స్థానిక నగిరి మండలం గుండ్రాజుకుప్పం ఉన్నత పాఠశాలకు గురువారం పుత్తూరు కార్తిక్ షామియానా సప్లేయర్స్ అధినేత బొల్లిని మధునాయుడు త్రాగునీటి శుద్ధి యంత్రాన్ని గురువారం రోజున వితరణగా అందించడం జరిగింది. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుమలరాజు ద్వారా విద్యార్థులకు రక్షిత మంచినీటి అవసరాన్ని గుర్తించి అందించామని దాత తెలియచేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజా రాణి దాతను కొనియాడారు. నీటి శుద్ధీకరణ యంత్రం గంటకు 50 లీటర్లు శుద్ధిచేస్తుందని పాఠశాలలో విద్యనభ్యశిస్తున్న విద్యార్థులకు మంచి నీటిని అందించాలనే సద్దుదేశ్యంతో వితరణగా అందించామని దాత మధునాయుడు తెలిపారు. దాతని పాఠశాల ఉపాధ్యాయులు మరియు కమిటి సభ్యులు దుశ్శాలువతో సన్మానించారు.

రేపు శ్రీవారి కల్యాణం

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఆవులపల్లి గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో శ్రావణ శనివారం పౌర్ణమి సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకొని 8వ తేదీ శుక్రవారం ఆలయంలో మహిళల కొరకు ప్రత్యేకంగా కుంకుమ గాజులు పసుపుదారం కంకణాలను ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 9 గంటలకు అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి- రొంపిచర్ల: నులిపురుగుల నివారణపై అవగాహన పెంచుకోవాలని రొంపిచర్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి దినేష్ కుమార్ నాయక్ అన్నారు. ఆయన గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. కడుపులో నులిపురుగులు ఉంటే అనారోగ్యం బారినపడతారని అన్నారు. 1 నుంచి 19 సంవత్సరాల వయసు ఉన్నవారు అందరూ నులిపురుగుల నివారణ కొరకు ఆల్బెండజోల్ మాటలను వేసుకోవాలని తెలిపారు. అలాగే రెండు సంవత్సరాల లోపు గల పిల్లలకు మాత్రమే పొడిచేసి తాగించాలన్నారు. త్వరలోనే నులిపురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేస్తామని అన్నారు. వీటిని పిల్లలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఏవో రెడ్డప్ప ఆచారి, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి దినేష్ కుమార్ నాయక్

జీఎస్టీ పక్కాగా వసూలు చేయాలి

అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జీఎస్టీ పక్కాగా వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని ప్రత్యేక సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వాణిజ్య పన్నులశాఖ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. చిత్తూరు డివిజన్ వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... పన్నుదారుల నుంచి జీఎస్టీ వసూలు చేయడానికి సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నా పన్ను పరిధిలోకి రాని సంస్థలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. డిఫాల్టర్స్ బ్యాంక్ అటాచ్మెంట్ విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బిల్లుల చెల్లింపుల ముందు టాక్స్ డిడక్షన్ తప్పనిసరిగా అమలు చేసి రెవెన్యూ లోటును నివారించాలన్నారు. అన్ని ప్రొఫెషనల్ సర్వీసు సంస్థలు, విద్యాసంస్థలు, ఇంజనీరింగ్, మెడికల్ ప్రొఫెషనల్స్ తప్పనిసరిగా జీఎస్టీ పరిధిలోకి రావాల్సిందేనని అన్నారు. మున్సిపల్ కమిషనర్లు వార్డుల్లో పర్యటించి పన్నులు విధించే ప్రక్రియను బలోపేతం చేయాలన్నారు. పన్నులు వసూలు పెంపుకు సంబంధితశాఖలు, బ్యాంకులు, స్థానిక సంస్థలు సమన్వయంతో పని చేయాలన్నారు. స్థిరాస్తుల గుర్తింపు, బకాయిల వసూళ్ల సందర్భంలో ఆస్తులను జప్తు చేయడంలో రెవెన్యూ శాఖ, పన్నుల ఎగవేస్తున్న నకిలీల గుర్తింపు, కేసుల నమోదు, పన్నుల ఎగవేస్తున్న నకిలీల గుర్తింపు, కేసుల నమోదు, ఎన్టీటీపీ కేసులలో ఎన్ఐఆర్ నమోదు చేయడంలో పోలీస్ శాఖ, మైనింగ్ లైసెన్సులు మంజూరు చేసే ముందు జీఎస్టీ రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ లైసెన్సుల పునరుద్ధరణ సందర్భాల్లో వాణిజ్య పన్నుల శాఖ నుంచి బకాయిలు లేవన్న సర్టిఫికెట్లు పొందాలన్నారు.

సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి- పలమనేరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్‌లో వివిధ ఉచిత కోర్సుల్లో శిక్షణ పొంది, ఉత్తీర్ణులు అయినవారికి వారికి గురువారం స్థానిక ఎస్‌విసిఆర్ కళాశాలలో సర్టిఫికెట్లను ఇవ్వడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు మాట్లాడుతూ పలు కోర్సుల్లో 28 మందికి మూడు నెలల శిక్షణ పొందిన తర్వాత సర్టిఫికెట్లు పొందినట్లు చెప్పారు. ఈ ఉచిత కోర్సుల్లో నేర్చుకున్న నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలను పొందవచ్చు అని, ఈ స్కిల్ హబ్‌లో తరచూ కొత్త ఉచిత కోర్సులను ప్రారంభిస్తామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కొరకు సిసింద్రీ (84658 30771)నంబరును, సంప్రదించగలరని తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ స్కిల్ హబ్ ఇంచార్జి సుబ్బయ్య నాయుడు, కోఆర్డినేటర్ సిసింద్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రం పై వేమన వంశీయులు

పద్యాలు పాడుతూ సంచారం



ప్రజాశక్తి- సోమల: వేమన వంశానికి చెందిన ఒకతను కదిరి నుండి పల్లెపల్లె తిరుగుతూ పద్యాలు పాడుతూ సంచారం చేస్తూ సదుం మండలంలో ప్రజాశక్తి కెమెరాకు చిక్కారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము గ్రామాలు పల్లెలు తిరుగుతూ వేమన పద్యాలు పాడుతూ ప్రజలు ఇచ్చిన డబ్బులు నిత్యావసర సరుకులు తీసుకుంటూ సంచారం చేస్తున్నామని రెండు గుర్రాలలో తిరుగుతున్నామని పది మంది బృందంగా ఉన్నట్లు తెలిపారు. పసుపుపచ్చ దుస్తులతో గుర్రంపై తిరుగుతున్న వ్యక్తిని చూడడానికి చిన్నారులు పెద్దలు ఆసక్తి చూపుతున్నారు.

పచ్చికాపల్లంలో పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో పారిశుధ్య పనులను చేపట్టారు. గురువారం సర్పంచ్ కుమారి (వెంకట ముని) కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. అలాగే గ్రామ పురవీధుల్లో డ్రైనేజీ కాలవలో పేరుకుపోయిన వ్యర్థాలను కార్మికుల సహాయంతో తొలగించారు.

'విద్యాశక్తి'ని వాయిదా వేయండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అమలు పరుస్తున్న విద్యాశక్తి కార్యక్రమాన్ని వాయిదా వేయాలని వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ వీ.రెడ్డిశేఖర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాశక్తి కార్యక్రమాన్ని సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు నిర్వహించాలని చెప్పడం అధికారుల అనాలోచిత నిర్ణయమని తెలిపారు. నూతన కేడర్ స్ట్రెంత్ ప్రకారం ఉపాధ్యాయులకు ఒక పీరియడ్ మాత్రమే లీజర్ దొరుకుతుందని, రోజంతా తీరిక లేకుండా పాఠశాలలో సతమతం అవుతున్నారని, మరో గంట పాటు అదనంగా తరగతులు నిర్వహించాలని ఇబ్బందులకు గురిచేయడం తగదని అన్నారు. విద్యాశక్తి కార్యక్రమాన్ని జనవరి నుండి అమలు చేయాలని అంతవరకు వాయిదా వేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

ప్రజాశక్తి- విజయపురం: తల్లిపాలు బిడ్డకు అమృత వంటివని ప్రధానోపాధ్యాయులు వెంకమరాజు పేర్కొన్నారు. గురువారం విజయపురం మండలం శ్రీహరిపురం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు బిడ్డకు తాగించాలని వాటిలో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందని తెలిపారు. రెండు సంవత్సరాలవరకు బిడ్డకు తల్లుపాలు ఇవ్వాలని ఆరోగ్య కార్యకర్తలు వినోలియా, గీత పేర్కొన్నారు. తల్లిపాలు ప్రాముఖ్యతను తెలియచేసి పోస్టర్లను కేంద్రం నందు ప్రదర్శించారు. అంగన్వాడీ టీచర్ సుజాత సహాయకులు గంగోత్రి, ఆశ కార్యకర్తలు సుజాత, లక్ష్మి తల్లులు పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార సంఘం

మండల అధ్యక్షులుగా నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: వ్యవసాయ సహకార సంఘ మండల అధ్యక్షులుగా నిరంజన్ రెడ్డి ఎన్నికయ్యారు. తనకు ఈ పదవి రావడానికి కృషిచేసిన గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కి, మండల టిడిపి అధ్యక్షులు జయశంకర్ నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ క్షేత్రస్థాయి నుంచి మండల స్థాయి వరకు తెలుగుదేశం పార్టీని కృషి చేసినందుకు తన సేవలను గుర్తించి ఈ పదవి రావడం ఎంతో గర్వంగా ఉందని తెలిపారు.

నేరాల నియంత్రణకు పల్లెనిద్ర : డీఎస్పీ

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: నేరాల నియంత్రణకు గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగిరి డిఎస్పి సయ్యద్ మహమ్మద్ అజీజ్ తెలిపారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ ఆదేశాల మేరకు గురువారం రాత్రి ఎస్ఆర్ పురం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట గ్రామంలో ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ పోలీస్ సిబ్బందితో కలిసి డిఎస్పి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు వివిధ రకాల మోసాల గురించి అవగాహన కల్పించారు. మోసగాళ్లు ఎలా నేరాలకు పాల్పడుతున్నారు వారి బారిన పడకుండా ఇలాంటి జాగ్రత్త తీసుకోవాలని విషయాలు వివరించారు. మహిళల భద్రతకు సంబంధించిన శక్తి యాప్ ఉపయోగాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ పురం హెడ్ కానిస్టేబుల్ మేఘవర్ణం, కానిస్టేబుల్ హరిప్రసాద్, కానిస్టేబుల్స్ బాలాంబిక, చాముండేశ్వరి, వజ్రవేలు పాల్గొన్నారు.

'ఫీమేల్' యాత్రికులకు 'ఫ్రీ' లేదు

'తిరుపతి-తిరుమల' మధ్య 'స్త్రీశక్తి' నైనై

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ఎన్నికల హామీలో భాగంగా 'స్త్రీ శక్తి' పథకం రాష్ట్రవ్యాప్తంగా కొన్ని బస్సుల్లో వర్తిస్తున్నా, తిరుమల- తిరుపతి మధ్య సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌ల్లో ఉచిత ప్రయాణం లేదని రాష్ట్ర ప్రభుత్వం తేల్చేసింది. ఈ మేరకు ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ విజయనగరం పర్యటనలో భాగంగా అధికారికంగా వెల్లడించారు. తిరుమల తిరుపతి మధ్య రోజుకు ఎక్స్‌ప్రెస్‌లు, సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లు, ఎలక్ట్రికల్ బస్సులన్నీ కలిపి 500 బస్సులు తిరుగుతున్నాయి. ప్రభుత్వం పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో ఏ బస్సు ఎక్కినా ఉచితమేనని ప్రకటించింది. అయితే తిరుపతి- తిరుమల మధ్య తిరిగేవన్నీ ఎక్స్‌ప్రెస్ బస్సులే. ఈ బస్సుల్లో మాత్రం ఉచితం లేదని ఛైర్మన్ ప్రకటనలతో తేల్చేశారు. తిరుపతి రీజియన్ పరిధిలో అలిపిరి, తిరుపతి, మంగళం, తిరుమల, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట డిపోల పరిధిలో 350 ఎలక్ట్రికల్ ఏసీ బస్సులు మంజూరయ్యాయి. ఇందులో అలిపిరి డిపోకు 50 బస్సులు చేరుకున్నాయి. త్వరలోనే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మిగిలిన 300 బస్సులు సెప్టెంబర్ మొదటివారంలో ఆయా డిపోలకు చేరుకోనున్నాయి. నెల్లూరు-తిరుపతి, కడప-తిరుపతి, మదనపల్లి - తిరుపతి, చిత్తూరు - తిరుపతి, చెన్నయ్ - తిరుపతి మీదుగా ఈ సర్వీసులు ఎక్కువగా నడుస్తున్నాయి. ఈ బస్సుల్లో ఎక్కువభాగం తిరుమలకూ సేవలందించనున్నాయి. తిరుమల సెంట్రల్ బస్సు స్టేషన్‌లో ఈ బస్సులకు సంబంధించిన ఛార్జింగ్ పాయింట్లు తక్కువగా ఉండడంతో, బస్సుల సంఖ్య రీత్యా ఆయా డిపోల పరిధిలోనే ఇవి ఛార్జింగ్ పెట్టుకుని తిరుమల వెళ్లనున్నాయి. అయితే తిరుపతి - తిరుమల మధ్య మాత్రం మహిళా ప్యాసింజర్లకు ఉచితం లేదు.

వీడని 'విలీన' వ్యథ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆదర్శ పాఠశాలల పేరిట చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ బడుల విలీనప్రక్రియ నిరుపేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తోంది. విలీనానికి తాము దూరమన్న బడులపై విద్యాశాఖ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో వందలాదిమంది విద్యార్థులు బడిబయటే నిరీక్షించాల్సి వస్తోంది. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేయడంతో పాటు ఊరి బడికి ఉరి వేసేలా గత జగన్ ప్రభుత్వం అమలు చేసిన జీవో 117ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఆ జీవోను తలదన్నేలా మోడల్ స్కూల్స్ పేరిట బడులను విలీనం చేస్తూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను మూతపడేటట్లు చేస్తోంది. విలీన ప్రక్రియ కార్యక్రమ బాధ్యతను ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులపై పెట్టారు. 'ఏమైనా చేసుకోండి.. బుజ్జగించండి .. బతిమలాడండి.. అంతిమంగా తల్లిదండ్రులను ఒప్పించి విలీనానికి అనుకూలంగా తీర్మానాలు చేసి పంపాలి' అంటూ ఎంఇఒలు ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసేశారు. ఆ మేరకు అధికారులు తగ్గేదేలే అంటూ తిరుపతి జిల్లా వ్యాప్తంగా విలీన ప్రక్రియ దాదాపు పూర్తి చేయగా.. తూర్పు మండలాల్లో మాత్రం విలీనానికి వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు తాము తగ్గేదిలే అంటే ఆందోళనలు చేస్తుండడం గమనార్హం.

విద్యకు దూరంగా పేద విద్యార్థులు

తిరుపతి జిల్లా వ్యాప్తంగా 1844 ప్రాథమిక పాఠశాలలు, 188 ప్రాథమికోన్నత, 322 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో 94,178 మంది, ప్రాథమికోన్నతలో 57,801 మంది, ఉన్నత పాఠశాలల్లో 35,465 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలల్లో 4,784, ప్రాథమికోన్నతలో 5,678, ఉన్నత పాఠశాలల్లో 7,415 మొత్తం 17,877 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న తరగతుల విలీనం వల్ల ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయే పరిస్థితి ఏర్పడింది. మరీ ముఖ్యంగా పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. 3, 4, 5 తరగతులను కిలోమీటర్ల అవతల ఉన్న పాఠశాలలకు పంపడం వల్ల అక్కడ 1, 2 తరగతులే మిగులుతున్నాయి. దీంతో 1, 2 తరగతుల విద్యార్థుల సంఖ్య 10 నుంచి 15 లోపే ఉండటంతో అవి ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగులుతున్నాయి. దీంతో ఆ పాఠశాలలకు పంపేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. మరోపక్క తల్లికి వందనం పథకాలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకూ అమలు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అమాంతంగా పడిపోతోంది. తరగతుల విలీనంతో దూరంగా ఉన్న పాఠశాలలకు తల్లిదండ్రులు పంపలేకపోతున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వేడాం మిట్టకండ్రిగ, వేడాం, పల్లంపేట ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులను మరో చోట విలీనం చేయడంతో గత రెండు నెలలకాలంగా అక్కడి విద్యార్థులు బడులకు వెళ్లడం లేదు. చదువుకు దూరంగానే ఉంటున్నారు. ఈ తరహా సమస్య తూర్పు మండలాల్లోని చాలా గ్రామాల్లో ఉంది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది విద్యార్థులు విలీన ప్రక్రియ కారణంగా బడిబయటే ఉన్నట్లు సమాచారం.

కేసులు పెడతామంటూ బెదిరింపులు

ప్రభుత్వ బడుల విలీన ప్రక్రియపై జిల్లాలోని తూర్పు మండలాల్లో పెద్ద ఎత్తున విద్యార్థుల తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 44 ప్రాథమిక పాఠశాలల్లో విలీన ప్రక్రియకు వ్యతిరేకంగా తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్ కు తీర్మానాలు పంపారు. విలీనం ఆగుతుందని అధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు అందాయి తప్పా, అధికారికంగా రాలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు మరింత ఆందోళనకు దిగుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలోని పల్లంపేట పల్లంపేట ప్రాథమిక పాఠశాలకు గ్రామస్తులు తాళాలు వేశారు. దీంతో పది రోజులుగా ఉపాధ్యాయులు బడిబయటే ఉంటున్నారు. దీన్ని పై స్పందించిన డిఇఒ గ్రామస్తులపై కేసు పెట్టాలంటూ ఏర్పేడు మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది.

పోక్సో కేసులో లోకేష్‌కు 20 ఏళ్ల కారాగార శిక్ష

పోక్సో కేసులో శిక్ష పడ్డ బండి లోకేష్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

వెదురుకుప్పం మండలం మొండివెంగన పల్లెకు చెందిన లోకేష్ 2022వ సంవత్సరంలో అప్పట్లో 14 సంవత్సరాలు వయస్సు కలిగిన మైనర్ అమ్మాయిని మోసపూరిత మాటలతో నమ్మించి తాను బాలిక అని తెలిసి తన తల్లితండ్రులకు తెలియకుండా ఊతుకోటకు తీసుకు వెళ్లి గుడిలో పెళ్లి చేసుకొని ఇల్లు బాడుగకు తీసుకొని ఆ ఇంటిలో ఆ బాలికతో పలుమార్లు శారీరకంగా కలిసాడు. తమ కూతురు కనపడలేదని చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో 4.2.22 న తేదీన బాలిక తల్లిదండ్రులు పిర్యాధు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేసి తిరుపతి డీఎస్పీ, చిత్తూరు పోక్సో కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. చిత్తూరు పోక్సో కోర్టులో కేసును విచారణ చేసి నిందితుడు లోకేష్‌ను దోషిగా నిర్ధారణ చేసి పోక్సో కోర్టు జడ్జి ఎం.శంకరరావు లోకేష్‌కు 20 సంవత్సరాల కారాగార శిక్ష, రూ.9500లు జరిమానా విధించారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహన కుమారి వాదించారు. లైసన్ ఆఫీసర్ బి.గిరీష్ సాక్షులను కోర్టులో హాజరుపరిచారు.

పెరటికోళ్లతో ఆదాయం..ఆరోగ్యం..!

ప్రజాశక్తి- రామకుప్పం: వెలుగు సంఘాలలోని డ్వాక్రా మహిళలు ఇళ్ల వద్ద పెరటి కోళ్ల పెంపకతో వాటి విక్రయంతో, ఆదాయం, గుడ్లు, మాంసంతో ఆరోగ్యం పొందవచ్చునని టిడిపి యూనిట్ ఇంచార్జులు రవిరెడ్డి, వెంకటరమణ పేర్కొన్నారు. రామకుప్పం సమీపంలోని వెలుగు కార్యాలయం వద్ద డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వంద యూనిట్ల పెరటి కోళ్లను పంపిణి చేయడం జరిగింది. ఈ కోళ్లతో గర్భవతులు, బాలింతలు దీని ద్వారా వచ్చే గుడ్లులు, మాంసం తిని వారి ఆరోగ్యం మెరుగు పార్చుకోవాలని ప్రభుత్వం ఉద్దేశంగా పేర్కొన్నారు. యూనిట్ కోళ్ల ధర రూ.3100లని అన్నారు. యూనిట్‌కు 11కోళ్లు, మందులు పంపిణి చేయడం జరిగింది. రామకుప్పం వెలుగు ఏపీఎం శ్రీనివాసులు, జనార్ధన్, మంజునాథ్‌రెడ్డి, హరి, సిబ్బంది ఉన్నారు.

వరి సాగు పద్ధతిపై శిక్షణ

ప్రజాశక్తి - రొంపిచర్ల: మండలంలోని రైతులకు వరి సాగుపై జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని, ప్రతి రైతు పెట్టుబడి తగ్గించుకొని దిగుబడి పొందే విధానాన్ని రూపొందించే విధానంలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. వరి పండించే రైతులందరూ ఆరుతడి పంటను పండించుకోవాలని, నీటిని నిలువ చేసే విధానం నేర్చుకోవాలని నీటితో పాటు కరెంటు బిల్లు పొదుపు రైతు సమయాన్ని కూడా పొదుపు చేసుకోవచ్చని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరి సాగు పద్ధతులపై ఎన్ఎఫ్ఏలు నాంచారమ్మ, ఫైజునిషా, కవిత, మహేష్, రైతులకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి- రొంపిచర్ల : ప్రభుత్వం అమలు చేస్తున్న సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రావణి అన్నారు. ఆమె గురువారం రొంపిచర్లలోని రైతు సహాయ కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో శ్రావణి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు ఇంకా ఇతర వివరాలు కావలసినవారు సమాచార హక్కు చట్టం ద్వారా అధికారుల నుంచి పొందవచ్చునని అన్నారు. సమాచారం ఇవ్వని అధికారులు ఎవరైనా ఉంటే వారి పైన కోర్టులో కేసులు నమోదు చేయవచ్చునని నిర్లక్ష్యం చూపిన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. సమాచారం తీసుకోవాలనుకునే లబ్ధిదారులు దానికి అయ్యే ఖర్చును వారే భరించాలని అన్నారు. ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సుబ్రహ్మణ్యం, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

బెల్టు షాపులో తనిఖీలు

మద్యం దుకాణంలో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు పరిసర ప్రాంతాలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న పుంగనూరు ఎక్సైజ్ పోలీసులు చిత్తూరు స్పెషల్ స్క్వాడ్ పోలీసులు గురువారం పలు గ్రామాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల మండలంలో పలు పల్లెల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ ఉండడం వీటివల్ల గ్రామాలలో మద్యం ప్రియులు తాగి గొడవలు పడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ ఉండడంతో ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నట్లు సమాచారం. దీంతో చిత్తూరు స్క్వాడ్ బృందం పుంగనూరు ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా కందూరు పరిసర ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించి బెల్ట్ షాపు నిర్వాహకుల గురించి సమాచారం సేకరించినట్లు తెలిసింది. అదేవిధంగా కందూరులోని మద్యం దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

తిరుపతిలో కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: సాయి సిల్క్స్ (కళామందిర్) లిమిటెడ్ తమ కార్యకలాపాలను విస్తతం చేయడంలో భాగంగా తమ చీరల బ్రాండ్ కాంచీపురం వర మహాలక్ష్మి సిల్క్స్ ను తిరుపతిలో గురువారం ప్రారంభించింది. తిరుపతి అన్నమయ్య సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన షోరూం ప్రారంభానికి ఆధ్యాత్మిక ధర్మ ప్రచారకర్త త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, తిరపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ రాజేష్ అన్నం మాట్లాడుతూ తమ సంస్థ 70వ షోరూంను తిరుపతిలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. తమ వద్ద స్వచ్ఛమైన కంచి పట్టు చీరలు, హ్యాండ్లూమ్, బనారస్, పటోల, కోట, పైథాని, కుప్పడం, ప్రీమియం, అన్ని రకాల చీరలు అత్యంత తక్కువ ధరలకు లభిస్తాయి అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి తమిళనాడులో వివిధ బ్రాండ్స్ రూపంలో కార్యకర్తలు నిర్వహిస్తుండగా, తిరుపతిలో ఏర్పాటుచేసిన కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ ఆంధ్రప్రదేశ్లో ఎనిమిదవ షోరూమ్ అని తెలిపారు. కాంచీపురం లో అతి పెద్ద షోరూం కలిగి ఉండడంతో పాటు సొంత మగ్గాలు చేనేత కార్మికులు ఉండడంతో మార్కెట్లో మరెవరు ఇవ్వలేని క్వాలిటీ, ప్రైస్, బ్రాండ్ ఇవ్వగలుగుతున్నామన్నారు. ఇటీవలే సాయి సిల్క్స్ లిమిటెడ్ ఐపీఓ ద్వారా స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించింది అని తెలిపారు. తమ షో రూమ్ లో అన్ని రకాల చీరలు అందరికీ అందుబాటు ధరలో లభిస్తాయని, మహిళలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు శుభాష్, దుర్గారావు పాల్గొన్నారు.

IN THE COURT OF THE VI ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR
O.S.No.320 OF 2024
Canara Bank, Bangarupalyam Branch, Rep., by its Branch Manager. ..Plaintiff
-versus-
P.Manohar and another ..Defendants
SUIT SUMMONS TO 2ND DEFENDANT
To
G.Kumar S/o Kuppaiah,
Lakshmipuram village,
Ragimanupenta post,
Bangarupalyam Mandal,
Chittoor District.
Sir,
Please take notice that the plaintiff bank has filed the above suit against you and P.Manohar for recovery of the amount. The said suit is posted to 29.8.2025 for your appearance. If you have got any objection you may appear on 29.8.2025 at 10.30 A.M. either in person or through an Advocate and file your objections. If you fail to do so the matter will be decided ex-parte.
Sri M.Subramanyam Reddy
Advocate for Plaintiff
Chittoor, 06-8-2025